# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9th HAPPY ANNIVERSARY

9 సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 | సంచిక : 348 | పేజీలు : 4+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | ఆదివారం 25 ఆగస్టు 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## ఎన్ కన్వెన్షన్ కూల్చివేత తుమ్మిడి చెరువు ఎఫ్టీఎల్‌లో నిర్మాణం



- మూడెకరాల 30 గుంటలు స్వాధీనం చేసుకున్న హైడ్రా
- చెరువుకు 25 మీటర్ల ఫుల్ ట్యాంక్ లెవల్ లో ఉన్నట్టు గుర్తింపు
- మంత్రి కోమటిరెడ్డి ఫిర్యాదు మేరకు యాక్షన్ లోకి ఆఫీసర్లు
- భారీ యంత్రాలతో నిర్మాణాల కూల్చివేత

వివరాలు 11లో..

**హైదరాబాద్ పెన్ పవర్:** సినీ నటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను హైడ్రా బృందం కూల్చివేసింది. మాదాపూర్‌లోని తుమ్మిడి చెరువు ఎఫ్టీఎల్ లో నిర్మించిన భాగాన్ని భారీ బందోబస్తు మధ్య అధికారులు కూల్చివేశారు. మూడెకరాల 30 గుంటల చెరువు ఎఫ్టీఎల్ స్థలాన్ని కబ్జా చేసినట్టు మంత్రి కోమటిరెడ్డి ఫిర్యాదు చేయడంతో అధికారులు ఉదయం కూల్చివేతలు చేపట్టారు. భారీ యంత్రాల సాయంతో ఎఫ్టీఎల్ ప్రాంతంలో ఉన్న భాగాన్ని నేలమట్టం చేశారు. ఇవాళ ఉదయమే పోలీసుల బలగాలతో

# ఎన్ కన్వెన్షన్ కూల్చివేతతో అంతా అటెన్షన్..

## హైడ్రా యాక్షన్ పై సర్వత్రా చర్చ



- అనురాగ్ పై కొరడా ఝుళిపిస్తారా..?
- 'జన్వాడ' ఫాంహౌస్ కూల్చేస్తారా
- ఏ అక్రమ కట్టడాన్నీ వదలమన్న డిప్యూటీ సీఎం భట్టి
- కోర్టు ఉత్తర్వులను తప్పు పట్టిన ఎంపీ రఘునందన్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఎన్ కన్వెన్షన్ కూల్చివేతతో అంతా అటెన్షన్ అయ్యారు. హైడ్రా నెక్స్ట్ టార్గెట్ ఏమిటనే చర్చ మొదలైంది. ఇదే తరుణంలో అనురాగ్ యూనివర్సిటీ పై పోలీసు కేసు నమోదు కావడంతో అందరి దృష్టి పల్లా రాజేశ్వర్ రెడ్డి వైపు మళ్లింది. మేడ్చల్ జిల్లాలోని వెంకటాపురంలో చెరువు బఫర్ జోన్‌లో అనురాగ్ యూనివర్సిటీ నిర్మించారని ఇరిగేషన్ అధికారి పరమేశ్ ఫిర్యాదు మేరకు ఆ సంస్థ చైర్మన్ పల్లా రాజేశ్వర్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. దీంతో తర్వాత అనురాగ్ యూనివర్సిటీ అక్రమ

వివరాలు 2లో..

## తెలంగాణలో నో మంకీ పాక్స్..

### డీహెచ్ రవీంద్ర నాయక్ కీలక ప్రకటన



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ దేశాల్లో చాపకింద నీరులా విస్తరిస్తోన్న మంకీ పాక్స్‌పై డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌ంఫెల్ఫేర్ తెలంగాణ డా.రవీందర్ నాయక్ కీలక ప్రకటన చేశారు. తెలంగాణలో ఒక్క మంకీ పాక్స్ కేసు కూడా నమోదు కాలేదని తెలిపారు. మంకీ పాక్స్ వైరస్ వ్యాప్తి చెందే అవకాశం ఉందన్న డబ్ల్యూహెచ్?వో అలర్ట్‌గా ఉన్నామన్నారు. హైదరాబాద్ లోని

వివరాలు 2లో..

## ఉద్రిక్తంగా మారిన 'ఛలో ఆర్మూర్'.. నాయకుల ముందస్తు అరెస్ట్?

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్? చేస్తూ.. నిజామాబాద్? జిల్లా ఆర్మూర్?లో రైతు ఐకాస ఆధ్వర్యంలో 'ఛలో ఆర్మూర్' కార్యక్రమం నిర్వహించారు. రైతు ఐకాస కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మామిడిపల్లి రోడ్డుపై బైఠాయించారు. ధర్నాకు బీఆర్ఎస్, బీజేపీ, వామపక్షాలు మద్దతు



వివరాలు 2లో..

## ఇప్పటికే క్షమాపణ చెప్పా.. కాంగ్రెస్ రాజకీయం చేస్తోంది



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణంపై కేటీఆర్ చేసిన కామెంట్స్‌పై తీవ్ర దుమారం రేగిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి మహిళా కమిషన్ కేటీఆర్ కు నోటీసులు కూడా జారీ చేసింది. ఈ క్రమంలో వివరణ ఇచ్చేందుకు మహిళా కమిషన్ ముందు హాజరయ్యారు కేటీఆర్. ఈ క్రమంలో మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు కేటీఆర్. తన వ్యాఖ్యలపై ఇప్పటికే క్షమాపణ చెప్పానని, ఇదే విషయం మహిళా కమిషన్ వద్ద కూడా చెప్పానని అన్నారు. ఈ విషయంపై కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. కేటీఆర్ మహిళా కమిషన్ దగ్గరకు చేరుకున్న సమయంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. %ఖు=% వాహనాన్ని అడ్డుకునేం దుకు

వివరాలు 2లో..

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు.. కొత్త పెన్షన్ స్కీం



**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పింది. ఉద్యోగులకు కొత్త పెన్షన్ స్కీమ్ ఇచ్చేందుకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శనివారం (ఆగస్టు 24, 2024) జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు విజ్ఞాన్ ధార పేరుతో కొత్తగా యూనిఫైడ్ పెన్షన్ స్కీం ను తీసుకొస్తున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. 25 యేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి పూర్తి

వివరాలు 2లో..

## త్వరలోనే కొత్త బస్సులు కొనుగోలు చేస్తం

### ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలె : మంత్రి పొన్నం ప్రభాకర్?




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆర్టీసీలో ఉద్యోగ నియామకాలు చేపడుతామని, తర్వలోనే 3035 ఉద్యోగాలను కల్పిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవ న్ లో టీజీఆర్టీసీ ఉత్తమ ఉద్యోగులకు ప్రగతిచక్ర అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగి మరణిస్తే రూ. కోటి బీమా ఇచ్చేలా ఎంవోయూ చేసుకుం టుం దన్నారు. ప్రజలకు ఇబ్బందులు రానివ్వ కుండా, ప్రభుత్వం త్వరలోనే నూతన బస్సులు కొనుగోలు చేస్తామన్నారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రజలకు అందించడంలో ఆర్టీసీ ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత ఆర్టీసీకి పూర్వవైభవం వచ్చింద న్నా రు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు ఆర్టీసీని పట్టించుకోలేదన్నారు. ఆర్టీసీ సంస్థ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ. ఉద్యోగులు బాధ్యత పనిచేసి, ఆర్టీసీకి మంచి పేరు తీసుకురావా లన్నారు.? అనంత రం ఉత్తమ ఉద్యోగులకు పురస్కారాలను అందజేశారు.

## అందరూ కోర్టు ఆదేశాలు ఫాలో అవ్వాల్సిందే



**హైదరాబాద్ పెన్ పవర్:** వచ్చే నెల (సెప్టెంబర్) 7వ తేదీ నుండి దేశ వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభంకానున్నాయి. తెలంగాణ రాజధాని హైదరాబాద్?తో పాటు రాష్ట్రవ్యాప్తంగాపెద్ద ఎత్తున గణేష్ ఉత్సవాలు జరగనున్నాయి. ఇప్పటికే విగ్రహాల తయారీ పూర్తై అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. మరోవైపు వినాయక మండపాల ఏర్పాటు సైతం స్టార్ట్ అయ్యింది.

వివరాలు 11లో..

## షరతులు లేకుండా రుణమాఫీ చేయాలె

**హైదరాబాద్ పెన్ పవర్:** గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా కాకుండా..ఆక్రమణలు మొత్తం కూల్చి వేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. హైడ్రా ఆక్రమణలను కూల్చి వేయడం మంచి నిర్ణయం. భూమాత పోర్టల్??పై రైతులతో చర్చపెట్టాలి. రుణమాఫీని పక్కదోవ పట్టించటానికి మంత్రులు ప్రయత్నం చేస్తున్నారు. రుణమాఫీకి రేషన్? కార్డు అవసరం లేదని సీఎం చెప్పారు. కానీ రుణమాఫీ కావాలంటే అధికారులు

వివరాలు 2లో..



## ఎన్ కన్వెన్షన్‌కు ఎలాంటి అనుమతులు లేవు

- నాగార్జున ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరణ
- తుమ్మిడికుంట చెరువులోని అనధికార నిర్మాణాల్లో ఎన్ కన్వెన్షన్ ఒకటి అని వెల్లడి
- తుమ్మిడికుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలోని అక్రమ నిర్మాణాలన్నింటినీ కూల్చేసినట్లు వెల్లడి
- ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై హైకోర్టు స్టే లేదన్న హైడ్రా



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో గల ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) కమిషనర్ రంగనాథ్ వివరణ ఇచ్చారు. తుమ్మిడికుంట చెరువులోని అనధికార నిర్మాణాల్లో ఎన్ కన్వెన్షన్ కూడా ఒకటి అన్నారు. ఈ నిర్మాణాన్ని పూర్తిగా నేలమట్టం చేశామన్నారు. తుమ్మిడికుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలోని అక్రమ నిర్మాణాలను అన్నింటినీ కూల్చివేసినట్లు తెలిపారు. హైడ్రా,

వివరాలు 2లో..

## వరంగల్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయండి



**హైదరాబాద్ పెన్ పవర్:** వరంగల్ పట్టణాన్ని తీర్చిదిద్దడానికి మాస్టర్ ప్లాన్ వెంటనే సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని ఆయన కార్యాలయంలో కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా) అధికారులు, సంబంధిత శాఖల ఆఫీసర్లతో వరంగల్ నగర అభివృద్ధిపై సమీక్షించారు. ఏఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం తర్వాత వరంగల్ పట్టణాన్ని విస్తృత పరచడానికి, పలు అభివృద్ధి పనులు చేపట్టాడానికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసేందుకు గతంలో సమావేశాలు నిర్వహించామని మంత్రి తెలిపారు.

వివరాలు 2లో..

## సంపాదకీయం

# డీ లిమిటేషన్ టెన్షన్

దేశంలో చివరిసారిగా 1971వ సంవత్సరం జనాభా లెక్కల ప్రకారం 1977వ సంవత్సరం నాటికి 543 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. 1976వ సంవత్సరంలో నాటి ప్రధాని ఇందిరా గాంధీ 42 వ రాజ్యాంగ సవరణ ద్వారా 2021 జనగణన వరకు లోక్‌సభ స్థానాలను పెంచకుండా చట్టంచేశారు. అందుకు ప్రధాన కారణం దేశంలో జనాభా నియంత్రణను అమలు చేస్తున్న రాష్ట్రాలు నష్టపోకూడదని, జనాభా నియంత్రణను అన్ని రాష్ట్రాలు పాటించాలన్న ఉద్దేశంతో అనాడు ఇందిరా గాంధీ సర్కార్ చట్టం చేశారు. కానీ అప్పుడు ఏ కారణం చేతైతే జనాభా నియంత్రణను పాటిస్తున్న రాష్ట్రాలు నష్టపోవొద్దన్న భావనతో చట్టం తీసుకురాగా, ఇప్పుడు అదే చట్టం జనాభా నియంత్రణను పకడ్బందీగా అమలు చేసి విజయం సాధించిన రాష్ట్రాల పాలిట శాపం కానుందని జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ నియోజక వర్గాల పునర్విభజన చేసే విధానాన్ని చూస్తే అర్థమవుతుంది.2002 సం.లో ఆటల్ బిహారీ వాజపేయి నేతృత్వంలోని ఎన్‌డిఎ 84వ రాజ్యాంగ సవరణ చేసి 2026 తరువాత జరిగే తొలి జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ స్థానాల సంఖ్య పెంచాలని నిర్దేశించింది. పునర్విభజన ద్వారా అనుసరించే విధానాల వల్ల కేంద్రం సూచనల మేరకు కుటుంబ నియంత్రణ ద్వారా జనాభా పెరుగుదలకు అడ్డుకట్ట వేసిన దక్షిణాది రాష్ట్రాలకు తీరని నష్టం వాటిల్లనుంది. జనాభా తక్కువగా ఉండడం మూలాన లోక్‌సభలో ఆయా రాష్ట్రాల ప్రాతినిధ్యానికి భారీగా కోతపడనుంది.ఉత్తరాది రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాలు తెలంగాణ, కేరళ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల జనాభా తక్కువ. లోక్‌సభ నియోజక వర్గాల పునర్విభజనకు అనుసరించే ఈ జనాభా లెక్కల ప్రామాణికంతో ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభలో ఉన్న 543 మొత్తం స్థానాల్లో 23.74 శాతం అంటే 129 స్థానాల ప్రాతినిధ్యం ఉండగా, కేంద్రం అనుసరించే పునర్విభజన వల్ల ఆ రాష్ట్రాల ప్రాతినిధ్యం 6.26 శాతం తగ్గిపోయి 129 స్థానాల నుండి 103 స్థానాలకు పడిపోనుంది.కానీ ఇబ్బడిముబ్బడిగా జనాభాను పెరుగుదలలో పెద్దన్న పాత్ర పోషించిన ఉత్తరాది రాష్ట్రాలకే వరంగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విధానాలు ఉండడం గమనార్హం. అంటే 2026లో పునర్విభజన విధానాల ద్వారా జనాభా నియంత్రణలో దక్షిణ రాష్ట్రాల సాఫల్యత వాటి రాజకీయ ప్రాతినిధ్యానికే ఎసరు పెడుతుంది. లోక్‌సభలో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని ఒకేసారి పరిశీలిస్తే.. ప్రస్తుత సీట్లు 543 లో ఉత్తరాది రాష్ట్రాలైన యుపి 80 సీట్లు, మహారాష్ట్ర 48, పశ్చిమ బెంగాల్ 42, బీహార్ 40, మధ్యప్రదేశ్ 29 సీట్లను కలిగి ఉండగా, దక్షిణాది రాష్ట్రాలు ఎపి, తెలంగాణ 42 సీట్లు, కర్ణాటక 28 సీట్లు, కేరళ 20 సీట్లు, తమిళనాడు 39 సీట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. పునర్విభజన కోసం రెండు ప్రతిపాదనలను ఆలోచిస్తున్న కేంద్రం మొదటగా జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ స్థానాలను 848కి పెంచి దేశ జనాభాతో భాగించగా వచ్చేది దేశ పార్లమెంట్ స్థానం సగటు జనాభా, ఈ సగటు పార్లమెంటు జనాభా సంఖ్యతో రాష్ట్ర జనాభాను భాగిస్తే ఆ రాష్ట్రంలోని పార్లమెంటు స్థానాల సంఖ్య వస్తుంది.ఈ విధంగా చూస్తే మన దక్షిణాది రాష్ట్రాల స్థానం పార్లమెంటులో స్థానాలు 130 నుండి 165కు కొద్ది మేర పెరిగిన నిష్పత్తి ప్రకారం చూస్తే దారుణంగా 23 శాతం నుండి 19 శాతానికి పడిపోనుంది.. ఇక రెండో ప్రతిపాదన ఏంటంటే.. లోక్‌సభ స్థానాలను ప్రస్తుతం ఉన్న 545కే పరిమితం చేసి చేపట్టబోయే జనాభా లెక్కల ప్రకారం పునర్విభజించటం. ఇలా చేసినా నష్టపోయేది దక్షిణాది రాష్ట్రాలే. ఈ విధానంలో దేశ జనాభాను 545తో భాగిస్తారు. అప్పుడు జనాభా అధికంగా పెరిగిన రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలు కూడా పెరుగుతాయి. జనాభా తక్కువ ఉన్న రాష్ట్రాల్లో తగ్గిపోతాయి. ఈ లెక్కన తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 17 లోక్‌సభ స్థానాలు 14కు పడిపోతాయి. అంటే మూడు స్థానాలు ఎగిరిపోతాయి. రెండింటిలో ఏ విధానంలో నియోజక వర్గాలను పునర్విభజించినా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ తమ ప్రాబల్యం అధికంగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలే.. అంటే పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల మాట ఏ మేరకు చెల్లుబాటు అవుతుందో అర్థం చేసుకోచ్చు.దక్షిణాది రాష్ట్రాల మాదిరిగా కుటుంబ నియంత్రణకు ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో అధిక జనాభా కలిగిన ఉత్తరాది రాష్ట్రాలు లోక్‌సభ లో తమ సీట్ల సంఖ్యను ఇప్పటికన్నా ఎక్కువగా పెంచుకొనున్నాయి. ఈ లెక్కన చూస్తే పరిపాలన, అభివృద్ధి, జనాభా నియంత్రణ వంటి అంశాలపై దృష్టి సారించిన దక్షిణాది రాష్ట్రాలకు శిక్షగా లోక్‌సభ ప్రాతినిధ్యానికి, రాజకీయ ప్రాధాన్యానికీ కోతపడబోతుందన్నమాట. దాని వల్ల హక్కుగా రావాల్సిన నిధుల కోసం డిమాండ్ చేసే సత్తా, అనుకూలమైన విధానాల రూపకల్పన చేసేలా కేంద్రంపై ఒత్తిడి చేయగల శక్తి దక్షిణాది రాష్ట్రాలకు తగ్గుతుంది. పర్యవసానంగా ఉత్తర ? దక్షిణ విభేదాలు, ప్రాంతీయ ఉద్రిక్తతలకు పెచ్చరిల్లే ప్రమాదం కూడా లేకపోలేదు. కాబట్టి దక్షిణాది రాష్ట్రాలు అప్రమత్తమై దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అసమానతలు లేకుండా లోక్‌సభ స్థానాలను పునర్విభజన చేసే విధంగా ఇతర రాష్ట్రాల రాజకీయ పార్టీలతో స్థూలమైన ఏకాభిప్రాయాన్ని సాధించి తమ రాజకీయ ప్రాధాన్యతను కాపాడుకోవాలి.

నాగేశ్వర రావు
(నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు

# ఎన్ కన్వెన్షన్ కూల్చివేతతో
# అంతా అటెన్షన్..

- మొదటి పేజీ తరువాయి

నిర్మాణాలను కూల్చివేయబోతున్నారనే చర్చ మొదలైంది. ఇదే తరుణంలో జన్వాడ ఫాంహౌస్ వివాదం కూడా తెరపైకి వచ్చింది. చెరువు ఎఫ్టీఎల్ లో నిర్మించిన ఈ ఫాంహౌస్ ను కూల్చివేయబోతున్నారనే ప్రచారం ఊపందుకుంది. దీనిని కూల్చివేయొద్దని పేర్కొంటూ బీఆర్ఎస్ నాయకుడు ప్రదీప్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు పిటిషన్ ను కొట్టేసింది. దీంతో జన్వాడ ఫాంహౌస్ కూల్చివేతకు మార్గం సుగమం అయ్యింది. ఈ రెండింటిలో దేనిపై హైడ్రా యాక్షన్ ఉండబోతోందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇదే సమయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. ఎవరినీ వదలబోమని హైదరాబాద్ లోని నీటివనరులను పరిరక్షించడమే హైడ్రా ధ్యేయమని చెప్పారు. కూల్చివేతలను ఆపే ప్రసక్తే లేదంటూ క్లారిటీ ఇచ్చారు.

# తెలంగాణలో నో మంకీ పాక్స్..

- మొదటి పేజీ తరువాయి

గాంధీ ఆస్పత్రిలో మంకీ పాక్స్ కోసం ప్రత్యేకంగా ఐసోలేషన్ బెడ్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. శనివారం రవీంద్ర నాయక్ మీడియాతో మాట్లాడుతూ.. వాతావరణం మార్పు వల్ల దోమలతో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయన్నారు. వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటివరకు తెలంగాణలో డెంగ్యూ వ్యాధి కేసులు దాదాపు 5వేల వరకు ఉన్నాయని అందులో కొన్ని హై రిస్క్ కేసులను గుర్తించామని తెలిపారు. అయితే, డెంగ్యూ వల్ల ఒక్క డెత్ కూడా నమోదు కాలేదని వెల్లడించారు. ప్రతి సంవత్సరం వచ్చే వ్యాధులు కాబట్టి ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని.. కొంచెం జాగ్రత్తగా ఉంటే సరిపోతోందన్నారు. రాష్టంలో ఇంటి

ఇంటికి సర్వే చేస్తున్నామని, గ్రామాలు, మున్సిపాలిటీల్లో ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 42 ల్యాబ్స్ ఉన్నాయని, మొత్తం 33 జిల్లాలో అంబులెన్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలని భయభ్రాంతులకు గురి చెయ్యొద్దని సూచించారు.

# ఎన్ కన్వెన్షన్‌కు ఎలాంటి అనుమతులు లేవు

- మొదటి పేజీ తరువాయి

జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ సిబ్బంది కలిసి కూల్చివేసినట్లు వెల్లడించారు. చెరువులోని ఎఫ్‌టీఎల్‌లో ఒక ఎకరా 12 గుంటల్లో... అలాగే బఫర్ జోన్‌లోని 2 ఎకరాల 18 గుంటల్లో ఎన్ కన్వెన్షన్‌ను నిర్మించినట్లు తెలిపారు. ఈ నిర్మాణానికి జీహెచ్ఎంసీ నుంచి ఎలాంటి నిర్మాణ అనుమతులు లేవన్నారు. గతంలో అనుమతుల కోసం ప్రయత్నించినప్పటికీ... అనుమతులు రాలేదన్నారు.

**హైకోర్టు స్టే ఇచ్చిందనేది అవాస్తవం: హైడ్రా**

ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై గతంలో హైకోర్టు స్టే ఇచ్చిందని చెబుతున్నారని, కానీ అలాంటి స్టే ఏదీ లేదని హైడ్రా స్పష్టం చేసింది. స్టే ఇచ్చిందని చెప్పడం పూర్తిగా అవాస్తవమని పేర్కొంది. ఈరోజు మాత్రం కోర్టు స్టే ఇచ్చిందని, కోర్టు తీర్పును పాటిస్తామని తెలిపింది. చెరువులను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టినందునే కూల్చేసినట్లు తెలిపింది. తమ కట్టడాలను క్రమబద్ధీకరించుకోవడానికి ఎన్ కన్వెన్షన్ యాజమాన్యం గతంలో చాలా ప్రయత్నాలు చేసినట్లు వెల్లడించింది. కానీ ఆ విజ్ఞప్తులు తిరస్కరణకు గురయ్యాయని తెలిపింది. తాము చట్ట ప్రకారమే కూల్చివేతలు చేపట్టామని హైడ్రా స్పష్టం చేసింది. ప్రస్తుతం ఎన్ కన్వెన్షన్ జీరోగా మారిందని పేర్కొంది.

# ఎన్ కన్వెన్షన్ కూల్చివేత తుమ్మిడి చెరువు ఎఫ్టీఎల్‌లో నిర్మాణం

- మొదటి పేజీ తరువాయి

మాదాపూర్ కు హైడ్రా అధికారులు చేరుకున్నారు. ఎన్ కన్వెన్షన్ కు వెళ్లే అన్ని దారులను పోలీసులు మూసి వేశారు. అటువైపు ఎవరూ వెళ్లకుండా భారీకేడ్లను ఏర్పాటు చేశారు. కూల్చివేతలు పూర్తయ్యే వరకు ఎవరిని అనుమతించలేదు.

**వివాదం ఇదే?**

హీరో నాగార్జున, నల్ల ప్రీతమ్ రెడ్డితో కలిసి మాదాపూర్‌లో ఎన్3 ఎంటర్ ప్రైజెస్ పేరుతో ఎన్ కన్వెన్షన్‌ను 2015లో నిర్మించారు. మొత్తం 10 ఎకరాల్లో ఎన్ కన్వెన్షన్ ఉంది. ఇందులో 1.30 ఎకరాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయి. 2 ఎకరాలు బఫర్ జోన్‌ను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఇదే అంశంపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయి. దాంతో హైడ్రా అధికారులు చర్యలు తీసుకున్నారు.

**కీ పాయింట్స్**

ఎన్ కన్వెన్షన్ పై హైడ్రా చెప్పిన విషయాలివి..

తుమ్మడి చెరువు మొత్తం విస్తీర్ణం 29 ఎకరాలు

ఎన్ కన్వెన్షన్ ఆక్రమించిన జాగా 3.30 ఎకరాలు

2015లో ఎన్ కన్వెన్షన్ నిర్మాణం.. అప్పటి నుంచి వివాదం

ఆక్రమణలో రెండు హాల్స్, ఇతర శాశ్వత నిర్మాణాలు

కూల్చివేతల తర్వాత ఎన్ కన్వెన్షన్ ఆరెకరాల పది గుంటలు

25 మీటర్ల ఎఫ్టీఎల్ లో నిర్మాణం.. బఫర్ జోన్ కూడా ఆక్రమణలు

# వరంగల్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయండి

- మొదటి పేజీ తరువాయి

గతంలో ఉన్న 2041 మాస్టర్ ప్లాన్ ను 2050 నాటి జనాభాను దృష్టిలో ఉంచుకొని పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టుటకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆయన సూచించారు. ఇందుకు అవసరమైన భూముల సేకరణ చేపట్టాలని మంత్రి అన్నారు. ఇప్పటి వరకు కన్సల్టెంట్లు తయారు చేసిన మాస్టర్ ప్లాన్ లను మంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ పరిపాలన ముఖ్య కార్యదర్శి దాన కిషోర్,

రోడ్లు భవనాలు శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, కుడా వైస్ చైర్మన్, కమీషనర్ అశ్విని, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ గౌతమ్, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, కన్సల్టెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

# అందరూ కోర్టు ఆదేశాలు ఫాలో అవ్వాల్సిందే

వినాయక చవితికి మరో రెండు వారాల సమయం మాత్రమే ఉంటడంతో హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి శనివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ మీటింగ్?కు సంబంధిత అధికారులతో పాటు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ శ్రీనివాస్ రెడ్డి పలు కీలక సూచనలు చేశారు. నిర్దిష్ట ప్రదేశాల్లోనే గణేషుడి మండపాలు ఏర్పాటు చేయాలని, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగుండా చూడాలని నిర్వహకులకు సూచించారు. మండపం ఏర్పాటుతో పాటు నిమజ్జనం వేళ కోర్టు ఆదేశాలు పాటించాలని చెప్పారు. మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు.

నిమజ్జనానికి తగిన సంఖ్యలో క్రేన్లు ఏర్పాటు చేయాలని, రోడ్ల మరమ్మతు పనులు, లైట్ల ఏర్పాటు, విద్యుదాఘాత నివారణ చర్యలు చేపట్టాలని.. భారీ వాహనాలు సులువుగా వెళ్లేందుకు చెట్లు కత్తిరించడం వంటి పనులు చేపట్టాలని సంబంధిత శాఖలకు సూచించారు. ఇంటిమేషన్ ఫారమ్‌లను సక్రమంగా పూరించాలని ఉత్సవ సమితిలకు ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా పకడ్బందీ ప్రణాళికతో వినాయక ఉత్సవాలను నిర్వహించాలని అన్నారు.

## ఇప్పటికే క్షమాపణ చెప్పా.. కాంగ్రెస్ రాజకీయం చేస్తోంది

- మొదటి పేజీ తరువాయి

మహిళా కాంగ్రెస్ నేతలు యత్నించారు. కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ.. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు కాంగ్రెస్ నేతలు. ఇదే సమయంలోనే అక్కడికి చేరుకున్న బీఆర్ఎస్ మహిళా నేతలు పోటీగా నినాదాలు చేయటంతో ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు.. కొత్త పెన్షన్ స్కీం

- మొదటి పేజీ తరువాయి

పెన్షన్ అందిస్తామని తెలిపారు. ఇందుకోసం రూ. 10వేల 579 కోట్లు ఖర్చు చేయనున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు.

కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ..శనివారం (ఆగస్టు24,2024) నాడు ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఏకీకృత పెన్షన్ పథకానికి (%ఖూూ%) కేబినెట్ ఆమోదం తెలిపింది.. మొత్తం మూడు స్కీములకు కేబినెట్ ఆమోదించింది. ఇందులో మొదటిది 50శాతం భరోసా పెన్షన్ పథకం , రెండోది కుటుంబానికి భరోసా పెన్షన్.. ఇక మూడోది ఏకీకృత పెన్షన్ స్కీమ్ (యుపిఎస్) నుంచి దాదాపు 23 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రయోజనం పొందుతారు. ఉద్యోగులు ఎన్‌పిఎస్, యుపిఎస్‌లు రెండింటిలో ఎంపిక చేసుకునే అవకాశం ఉందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు.

## షరతులు లేకుండా రుణమాఫీ చేయాలె

- మొదటి పేజీ తరువాయి

రేషన్?కార్డు అడుగుతున్నారు.

ఎం రేవంత్? పర్యటనలు ఉంటే సీపీఎం నేతలను ముందస్తుగా ఎందుకు అరెస్ట్ చేస్తారు..? ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్? చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 29న ఎమ్మార్వో ఆఫీస్? ల ముందు ధర్నాలు నిర్వహిస్తాం" అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు.

## ఉద్రిక్తంగా మారిన 'ఛలో ఆర్మూర్'.. నాయకుల ముందస్తు అరెస్ట్?

- మొదటి పేజీ తరువాయి

ప్రకటించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడి రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలన్నారు. తక్షణమే ఎకరానికి రూ.7500 చొప్పున రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**ఆర్మూర్‌లో ఉద్రిక్తత..**

మహాధర్నా నేపథ్యంలో ఆర్మూర్ పట్టణంలో పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు. దీంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ధర్నా చేసేందుకు రైతులను అనుమతించలేదు. పరిష్మన్? లేకుండా రోడ్డుపై ధర్నా చేస్తే చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. రైతులు మామిడిపల్లికి రాకుండా ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. రేపటి వరకు ఆర్మూర్, బాల్కొండ సెగ్మెంట్లలో పోలీసులు ఆంక్షలు విధించారు. రైతులందరూ పంక్షన్ హాల్?లో సమావేశమయ్యారు. అనంతరం పోలీసులు ధర్నా చేసేందుకు అనుమతి ఇచ్చారు.

## రైల్వే ప్రయాణికులకు గుడ్ న్యూస్.. దశల వారీగా జనరల్ బోగీల పెంపు

హైదరాబాద్: రైళ్లలో జనరల్ బోగీల పెంపుపై రైల్వే కేంద్ర సహాయ మంత్రి రన్విత్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. రైళ్లలో దశల వారీగా జనరల్ బోగీలు పెంచుతామని.. ప్రయాణికులకు ఇబ్బందులు తగ్గిస్తామని తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్?లో జరుగుతున్న స్టేషన్ అభివృద్ధి పనులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ కలిసి రన్విత్ సింగ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 700 కోట్లతో సికింద్రబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు చేపడుతున్నామని, 2026 కల్లా పనులు మొత్తం పూర్తి కావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇప్పటివరకు 27 శాతం పనులు పూర్తి అయ్యాయన్నారు. చర్లపల్లి స్టేషన్ పనులు శరవేగంగా కంప్లీట్ అయ్యాయని.. త్వరలోనే ఆ స్టేషన్?ను ప్రారంభిస్తామని తెలిపారు. సికింద్రాబాద్ స్టేషన్లో సోలార్ ప్యానల్ ఏర్పాటు చేస్తున్నామని, నీటి సదుపాయం పెంచేందుకు పెద్ద ఎత్తున వాటర్ ట్యాంకులు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కొత్త ప్లాట్ ఫామ్స్, లిఫ్టులు, వైయిటింగ్ హాల్స్, పార్కింగ్ స్థలాలు అభివృద్ధి కూడా జరుగుతోందన్నారు. ప్రధాని మోడీ అమృత్ భారత్ స్టేషన్?లో భాగంగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఉన్న 119 రైల్వే స్టేషన్లను రూ.5000 కోట్లతో అభివృద్ధి చేయాలని సూచించారని.. ఇందులో భాగంగానే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కూడా అభివృద్ధి చేస్తున్నామన్నారు.

# ఆపరేషన్ కడప....

వైసీపీకి పవర్ పోయింది. మాజీ సీఎం సొంత జిల్లాలోనే పొలిటికల్ గేమ్ స్టార్ట్ చేసింది టీడీపీ. రాష్ట్రమంతా ఎలా ఉన్నా వైఎస్ జగన్ సొంత జిల్లాలో రాజకీయమంటే కొంత డిఫరెంట్. కానీ మొన్నటి ఎన్నికల్లో కడప జిల్లాలో కూటమి బంపర్ విక్టరీ సాధించింది. ఇప్పుడు ఏకంగా కడప జడ్పీ పీఠంపై కన్నేసింది టీడీపీ. మాజీ సీఎం జగన్ సొంత జిల్లాలో పాగా వేసి ఝలక్ ఇవ్వాలని ఫిక్స్ అయింది. అందుకే ఆపరేషన్ కడప జడ్పీని స్టార్ట్ చేసింది. టీడీపీ ఆకర్ష్‌తో వైసీపీ కూడా అలర్ట్ అయింది. దీంతో పోటాపోటీ రాజకీయాలు.. వ్యూహ ప్రతివ్యూహాలు, బుజ్జగింపులు, ప్రలోభాలతో కడప జిల్లా జడ్పీటీసీల చుట్టూ తిరుగుతోంది రాజకీయం.కడప జిల్లాలో మొత్తం 50 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. అందులో రెండు ఖాళీగా ఉండగా.. ఒక గోపవరం సభ్యుడు మినహా 48 మంది జడ్పీటీసీలు వైసీపీ వారే. ఎన్నికలకు ముందు వైసీపీని వీడి టీడీపీలో చేరారు ఐదుగురు జడ్పీటీసీలు. మరో జడ్పీటీసీ బీజేపీ గూటికి చేరారు. అయితే రాష్ట్రంలో ఇప్పటికే కొన్ని మున్సిపాలిటీలను తమ ఖాతాలో వేసుకుంది టీడీపీ. అందులో భాగంగా కడప జిల్లా జడ్పీ పీఠంపై కూడా ఫోకస్ పెట్టింది. దీంతో వైసీపీ ముందుగానే అలర్ట్ అయింది. మరింత మంది జడ్పీటీసీలు చేజారకుండా.. కడప జడ్పీ చైర్మన్ పదవి కూడా దూరం కాకుండా పావులు కదుపుతోంది.అందులో భాగంగా కడప జిల్లా జడ్పీటీసీలను విజయవాడకు పిలిపించారు మాజీ సీఎం జగన్. జడ్పీటీసీలతో వేర్వేరుగా సమావేశమైన జగన్ టీడీపీ ప్రలోభాలకు గురి కావద్దని సూచించారు. 2014లో వైసీపీ ఓడిపోయినప్పుడు కూడా ఇక పార్టీ పని అయిపోయిందని మాట్లాడారని గుర్తు చేశారు. ఆ తర్వాత 2019లో అధికారంలోకి వచ్చామన్నారు. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితే ఉందన్నారు. మళ్లీ 2029లో అధికారంలోకి వస్తామని, కాస్త ఓపిక పట్టాలని జడ్పీటీసీలను కోరినట్టు తెలుస్తోంది.కడప జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి రాజీనామా చేశారు. జడ్పీ చైర్మన్ పదవి ఖాళీ అయింది. దీంతో జిల్లా పరిషత్ చైర్మన్ పదవి చేజారకుండా కసరత్తు ప్రారంభించింది వైసీపీ. ఇప్పటికే కడప జడ్పీ చైర్మన్ అభ్యర్థిగా.. బ్రహ్మంగారి మఠం జడ్పీటీసీ రామగోవిందరెడ్డి పేరును ప్రకటించేశారు మాజీ సీఎం జగన్. ఎట్టి పరిస్థితుల్లో సొంత జిల్లాలో జడ్పీ పీఠాన్ని వదులుకోవద్దని పట్టుదలతో ఉన్నారు ఫ్యాన్ పార్టీ బాస్.ఈ మధ్యే ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవిని ఏకగ్రీవంగా గెలుచుకున్న వైసీపీ.. అదే హవాను కొనసాగించాలని భావిస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలకు కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని ఆరోపణలు ఎదుర్కొన్న జగన్.. ఇప్పుడు ఏకంగా జడ్పీటీసీలతో




ప్రత్యేకంగా సమావేశమయ్యారంటే.. కడప జడ్పీ పీఠాన్ని ఎంత ప్రెస్టేజ్‌గా తీసుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు.జగన్ సొంత జిల్లా కడపలో వైసీపీని రాజకీయంగా దెబ్బ తీయాలని టీడీపీ ఆలోచిస్తోంది. ఇందులో భాగంగా వైసీపీ చేతిలో ఉన్న కడప జెడ్పీని సొంతం చేసుకోవాలని ప్లాన్ చేస్తోంది. ఈ విషయాన్ని పసిగట్టిన వైసీపీ హైకమాండ్ ముందుగానే అలర్ట్ అయింది. ఏ రకంగా చూసినా వైసీపీ వైపు 40 మంది సభ్యులు ఉన్నారు. అయితే కూటమి అధికారంలో ఉండటంతో.. ప్రలోభాలకో, అధికారం కోసమో జడ్పీటీసీలు వెళ్తారని భావించిన వైసీపీ.. ముందు జాగ్రత్త చర్యలు మొదలు పెట్టింది.

నాగేశ్వర రావు (నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు

# రాష్ట్ర మంత్రి ఇలా... కేంద్ర మంత్రి అలా

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ హైదరాబాద్, ఆగస్టు 24:** సినిమా స్టార్స్ పవన్ కల్యాణ్, సురేష్ గోపి ఇద్దరూ కీలక పదవుల్లో ఉన్నారు. ఒకరు కేంద్రమంత్రి అయితే మరొకరు రాష్ట్ర మంత్రి, డప్యూటీ సీఎం. 24 గంటల వ్యవధిలో వీళ్లు చేసిన కామెంట్స్ వైరల్‌గా మారుతున్నారు. తీవ్ర చర్చనీయాంశమవుతున్నాయి. ఒకరు సినిమాలు ముఖ్యమని కామెంట్ చేస్తే మరొకరు సినిమాల కంటే ప్రజాసేవే ముఖ్యమని కామెంట్ చేయడం వైరల్ అవుతోంది. పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి వచ్చి ఎన్నో పోరాటాలు చేసి ఏపీకి ఉపముఖ్యమంత్రి అయ్యారు. నిజానికి పవన్ కల్యాణ్ ఒక స్టార్ హీరోగా అందరికీ తెలుసు. ఎన్నో హిట్ సినిమాలు చేసిన ఆయన కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకున్నారు. ఆయన్ని 70 ఎంఎం స్క్రీన్ పై చూడాలని అభిమానులు తహతహలాడుతారు. పవన్ కల్యాణ్ సినిమా అంటే కాసుల వర్షమే. సినిమా హిట్ అయినా, ఫ్లాప్ అయినా రికార్డుల మోత మాత్రం ఆగదు. ఇక ఆయన కూడా ఒక్క సినిమా చేస్తే చాలు కోట్లలో రెమ్యునరేషన్ వస్తుంది. కానీ, అవేమి వద్దంటున్నాడు పవన్ కల్యాణ్. తనకు ప్రజా సేవే ముఖ్యం అని చెప్తున్నారు. దీంతో ఇప్పుడు ఆయన ఫ్యాన్స్ అందరూ కేంద్ర మంత్రి సురేశ్ గోపి, పవన్ కల్యాణ్ ని కంపేర్ చేస్తూ కామెంట్లు పెడుతున్నారు. ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గ్రామ సభలను నిర్వహిస్తున్నారు. తొలి గ్రామసభలో పాల్గొన్నారు పవన్ కల్యాణ్. అన్నమయ్య జిల్లాలోని రైల్వే కోడూరు నియోజక వర్గంలోని మైసూరువారిపల్లిలో ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు ఆయన. ఆ కార్యక్రమంలో పవన్ కల్యాణ్ కొన్ని కామెంట్స్ చేశారు. తనకు సినిమాల కన్నా సమాజం ముఖ్యం అని, సినిమాల కన్నా దేశం ఇంకా ముఖ్యం అని అన్నారు. సినిమాల కంటే గ్రామహితం ముఖ్యం అని చెప్పారు. అన్నంపెట్టే రైతు బాగుంటే అన్ని బాగుంటాయని, అందరి దగ్గర డబ్బులుంటేనే సినిమాలు ఆడతాయని చెప్పారు పవన్. అందుకే గ్రామాలు పచ్చగా ఉండాలని చెప్పుకొచ్చారు. పవన్ కల్యాన్ చేసిన ఆ కామెంట్స్ నిమిషాల్లోనే సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. దీంతో ఆయన ఫ్యాన్స్ ఆ వీడియోను తెగ షేర్ చేస్తున్నారు. దట్ ఈజ్ పవన్ కల్యాణ్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. సినిమాలు చేయను అని హింట్ ఇచ్చినందుకు బాధగా ఉందని, కానీ.. సంపాదన కంటే ఆయనకు







దేశ సేవే ముఖ్యం అని చెప్పిన ఏకైక వ్యక్తి అంటూ తెగ కామెంట్లు పెడుతున్నారు. ఆయన చెప్పిన మాటలు కొంత బాధకలిగిస్తున్నా.. మా హీరో అని చెప్పుకునేందుకు గర్వంగా ఉందంటున్నారు. సినిమాలే ముఖ్యమన్న కేంద్రమంత్రి.. కేంద్రమంత్రి సురేశ్ గోపి తనకు సినిమాలే ముఖ్యం అని, సినిమాలు లేకపోతే తాను బతకలేనని స్టేట్ మెంట్ ఇచ్చారు. కేరళ ఫిలిమ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ మీటింగ్ తిరువనంతపురం జరిగింది. ఆ మీటింగ్ కి ముఖ్య అతిథిగా వచ్చిన సురేశ్ గోపి ఈ కామెంట్స్ చేశారు. సినిమాలు చేసుకునేందుకు పర్మిషన్ ఇవ్వకపోతే పదవికి రాజీనామా చేసేందుకైనా సిద్ధమే అని అన్నారు. తనను కేంద్రమంత్రి పదవి నుంచి తొలగిస్తే ఆనందంగా సినిమాలు చేసుకుంటాను అని ఆయన కామెంట్ చేశారు. దీంతో ఇప్పుడు పవన్ ఫ్యాన్స్ ఆయన్ని, తమ అభిమాన హీరోని కంపేర్ చేస్తూ పోస్ట్ లు పెడుతున్నారు. పవన్ కల్యాణ్ సినీ కెరీర్ ప్రారంభించి దాదాపు 28 ఏళ్లు. అయితే, మొదటి నుంచి కూడా ఆయన ప్రజా సేవలోనే ఎక్కువగా ఉన్నారు. సినిమాల్లో ఉన్న సమయంలోనే ఎంతోమందికి సాయం చేశారు పవన్ కల్యాణ్. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కూడా ఆయన చాలా సేవా కార్యక్రమాలు కొనసాగించారు. పార్టీ తరఫున ఎన్నో మంచి పనులు చేశారు. రైతుల కోసం తన సొంతడబ్బును ఖర్చు చేశారు పవన్. అలా పదేళ్లు ప్రజా సేవలో ఉండి, ఎన్నో అవమానాలు, బాధలు, భరించి ఈ స్థాయికి వచ్చారు. అందుకే, ఆయనపై నమ్మకంతో ప్రజలు కట్టబెట్టిన ఈ పదవి, ప్రజలు ఇచ్చిన బాధ్యతే తనకు ముఖ్యం అంటూ చెప్పుకొచ్చారు పవన్. ఏదేమైనా పవన్ చేసిన కామెంట్స్ ఇప్పుడు ఆయన అభిమానుల్లో కొంత నిరాశ కలిగించినప్పటికీ.. ఆయన ఆలోచిస్తున్న తీరు మాత్రం అద్భుతం అని అంటున్నారు.

# ఇక రాం..మార్క్... కనిపిస్తుందా..

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ ఏలూరు, ఆగస్టు 24:** కశ్మీర్‌లో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయింది. విభజన తర్వాత ఎన్నికల ప్రక్రియ జరుగుతోంది. బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ఎన్నికల్లో బీజేపీ తరపున ఇంచార్జులుగా కిషన్ రెడ్డితో పాటు రామ్ మాధవ్ కూడా నియమితులయ్యారు. ఎన్నికల ఇంచార్జుల జాబితాలో రామ్ మాధవ్ పేరు చూసిన వారంతా ఆశ్చర్యపోయారు. మళ్లీ రామ్ మాధవ్ బీజేపీలో ఎప్పుడు పని చేయడం ప్రారంభించారని చర్చించుకోవడం ప్రారంభించారు. ఎందుకంటే.. ఆరెస్సెస్ బీజేపీ రాజకీయాల్ని వదిలేసి ఆరెస్సెస్ లోకి వెళ్లిపోయారు. గత ఐదేళ్ల కాలంలో ఆయన ఎక్కడా కనిపించలేదు. మళ్లీ ఇప్పుడే కశ్మీర్ పై దృష్టి సారించారు. 2014 ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం తర్వాత మోదీ ప్రధానమంత్రి అయ్యారు. ఆ సమయంలో ఆరెస్సెస్ నుంచి మురళీధర్ రావుతో పాటు రామ్ మాధవ్ బీజేపీలోకి వచ్చారు. ప్రధాన కార్యదర్శులుగా వారిద్దరికీ పార్టీలో చాలా పవర్ ఉండేది. ముఖ్యంగా రామ్ మాధవ్ కు ఈశాన్య రాష్ట్రాలతో పాటు జమ్మూకశ్మీర్ బాధ్యతలను బీజేపీ అగ్రనేతలు ఇచ్చారు. ఒకప్పుడు ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ ఉనికి నామమాత్రంగా ఉండేది కానీ.. రామ్ మాధవ్ ఇంచార్జ్ గా బాధ్యతలు తీసుకున్న తర్వాత అక్కడ అన్ని రాష్ట్రాల్లో బీజేపీ మిత్రపక్ష ప్రభుత్వాలే ఏర్పడ్డాయి. దాంతో ఆయన పేరు మారుమోగిపోయింది. జమ్మూకశ్మీర్ లోనూ పీడీపీతో కలిసి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో కీలక





పాత్ర పోషించారు. కానీ తర్వాత పరిస్థితులు మారిపోయాయి. కశ్మీర్ ప్రభుత్వాన్ని వద్దనుకున్నారు. ఆ తర్వాత జరిగిన కొన్ని పరిణామాలతో ఆయనకు బీజేపీ పెద్దలతో దూరం పెరిగిపోయింది. బీజేపీలో కీలక పాత్ర పోషిస్తున్న సమయంలో ఓ దశలో.. రామ్ మాధవ్ పేరు బీజేపీ అధ్యక్ష పదవికి వినిపించింది. కారణం ఏదైనా ప్రధాన కార్యదర్శి పదవి నుంచి ముందుకు పోలేదు. తర్వాత ఆ పదవి కూడా దక్కకపోవడంతో సైలెంట్ గా ఆరెస్సెస్ లోకి వెళ్లిపోయారు. అయితే మురళీధర్ రావు మాత్రం.. పదవులు వచ్చినా రాకపోయినా బీజేపీలోనే ఉన్నారు. ఇటీవల ఎన్నికల్లో ఆయన మల్కాజిగిరి టిక్కెట్ కోసం చాలా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఇప్పుడు మరళీధర్ రావుకు పెద్దగా బాధ్యతలు లేవు కానీ.. రామ్ మాధవ్ గతంలో కశ్మీర్ వ్యవహారాలను చక్కబెట్టి ఉండటంతో.. ఎన్నికల కోసం ఇంచార్జ్ గా నియమించి ప్రాధాన్య త కల్పిస్తున్నారు. రామ్ మాధవ్ గోదావరి జిల్లాలకు చెందిన వారు. మొదటి నుంచి ఆరెస్సెస్ లో కీలక పాత్ర పోషిస్తూ వస్తున్నారు. కేంద్ర బీజేపీలో కీలకంగా ఉన్న సమయంలో ఏపీ రాజకీయాల్లోనూ ఆయన పాత్ర ప్రముఖంగా ఉండేది. పలు సార్లు వివాదాస్పద కామెంట్లు చేసేవారు. జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ కు ఆయన సలహాలు ఇచ్చేవారని చెప్పేవారు. కారణం ఏదైనా తర్వాత ఇనాక్టివ్ అయ్యారు. ఇప్పుడు కశ్మీర్ ఎన్నికల్లో ఆయన మంచి ఫలితాలు సాధిస్తే మరోసారి బీజేపీలో కీలకమయ్యే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు.

## ఆయన తీరు శవాలపై పేలాలు ఏరుకుంటున్నట్టుగా ఉంది

- మొదటి పేజి తరువాయి

కంపెనీ ప్రమాదం పరిహారంపై జగన్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని అనిత అన్నారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన 17 మంది మృతుల కుటుంబాలకు, 36 మంది క్షతగాత్రులకు ఆర్టీజీఎస్ ద్వారా పరిహారం పంపించినట్టు చెప్పారు. వైసీపీ హయాంలో చోటుచేసుకున్న పాలిమర్స్ ప్రమాదంలో 15 మంది మృతి చెందగా... ఇప్పటికీ ముగ్గురు మృతుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం అందలేదని దుయ్యబట్టారు. ఎల్జీ పాలిమర్స్ కంపెనీ వద్ద వైసీపీ ప్రభుత్వం తీసుకున్న రూ. 150 కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో చెప్పాలని డిమాండ్ చేశారు. రియాక్టర్లు పాడైనప్పుడు ఆయా సంస్థల యాజమాన్యాలు వెంటనే స్పందించి రిపేర్లు చేయిస్తే ప్రమాదాలు జరగవని... ఒక్కో రియాక్టర్ మరమ్మతుకు రూ. 10 లక్షల నుంచి రూ. కోటి వరకు ఖర్చవుతుందని చెప్పారు. ప్రమాదాలు పునరావృతం కాకుండా రాష్ట్ర స్థాయిలో హైలెవెల్ కమిటీ వేస్తామని తెలిపారు.

## తిరుమలకు పొంచి ఉన్న నీటిముప్పు

- మొదటి పేజి తరువాయి

వస్తుంటారు. సాధారణ రోజుల్లో పరిస్థితి ఇలా ఉంటే... ప్రత్యేక రోజులు.. ముఖ్యమైన ఉత్సవాలు... బ్రహ్మోత్సవాల సమయంలో అయితే ఆ లెక్క నాలుగు రెట్లు పెరుగుతుంది. ఈ ఏడాది అక్టోబర్ నెలలో బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల సమయంలో ఒక గరుడ సేవ రోజు మాత్రమే 3 నుంచి 5 లక్షల మంది... ఇతర రోజుల్లో రోజుకు 2 లక్షల మంది తరలివచ్చే అవకాశం ఉంది. తమిళ పెరటాసి మాసంలో అయితే ఆ సంఖ్య బ్రహ్మోత్సవాలకు ఏ మాత్రం తగ్గకుండా భక్తులు వస్తారు.ఇంతవరకు అన్నీ బాగానే ఉన్నప్పటికీ ఇప్పుడు తిరుమలను నీటి కొరత పెద్ద సమస్యగా మారుబోతోంది. దేశంలో చాల ప్రాంతాల్లో వరదల కారణంగా వస్తున్న నష్టాలు చూస్తున్నాం. కాని ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మాత్రం ఆశించిన స్థాయిలో వర్షాలు నమోదు కాలేదు. గతేడాది కురిసిన వర్షాలు తప్ప ఈ సంవత్సరం వర్షపాతం నమోదు చాల తక్కువగా ఉంది. ఈ వర్షపాతం తగ్గడం వల్ల రానున్న రోజుల్లో భక్తులకు నీటి సమస్య ఎదురయ్యే అవకాశం ఉందితిరుమలలో ఇప్పటివరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. స్థానికులు, యాత్రికుల నీటి అవసరాలు తీర్చడానికి ఐదు డ్యామ్‌లలో లభ్యమయ్యే నీటిని వాడుతున్నారు. తిరుమలలోని గోగర్భం, ఆకాశ గంగ, పాప వినాశనం, కుమారధార, పసుపుధార డ్యామ్‌లలో మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 14,304 లక్షల గ్యాలన్లు. అయితే తిరుమలలో 5,800 లక్షల గ్యాలన్ల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ప్రస్తుతం డ్యామ్‌లలో ఉన్న నీరు రాబోయే 120 నుంచి 130 రోజుల వరకు మాత్రమే వస్తుందని టీటీడీ అధికారికంగా ప్రకటించారు. తిరుమలలో ప్రతి రోజూ 43 లక్షల గ్యాలన్ల నీటిని వినియోగిస్తున్నారు. ఇందులో 18 లక్షల గ్యాలన్ల నీరు తిరుమల డ్యాముల నుంచి మిగిలిన నీరు తిరుపతిలోని కళ్యాణి డ్యామ్ నుంచి సేకరిస్తున్నారు.తిరుమలలో అక్టోబరు 4 నుంచి 12 వరకు వార్షిక బ్రహ్మోత్సవాల వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేస్తుంది. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులతోపాటు ఆ తరువాత తిరుమలకు వచ్చే భక్తులకు నీటి సమస్య లేకుండా చేయడమే టీటీడీ ముందు ఉన్న ప్రాథమిక బాధ్యత. తిరుమలను సందర్శించే వేలమంది భక్తుల ప్రయోజనాల దృష్ట్యా, నీటి వృథాను అరికట్టాలని, నీటి వినియోగాన్ని నియంత్రించేందుకు కొన్ని చర్యలు తీసుకోవాలని టిటిడి నిర్ణయించింది. నీటి వృథా అరికట్టాలని భక్తులతో పాటు స్థానికులకు విజ్ఞప్తి చేస్తోంది. నీరు అయిపోకముందే వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురిస్తే తప్ప ఈసారి తిరుమలలో నీటి సమస్యకు పరిష్కారం దొరికే ఛాన్స్ లేదని విశ్లేషకులు అంటున్నారు.

## లాయర్ల అవసరం ఎంతో ఉంది...

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ నెల్లూరు, ఆగస్టు 24:** ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు సీఎం అయ్యాక.. ఎక్కడా ధర్మం, న్యాయం కనిపించడం లేదని వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోపించారు. తాడేపల్లిలోని తన నివాసంలో లాయర్లతో



సమావేశమైన జగన్.. కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని వ్యాఖ్యానించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసుల ఎదుటే క్రైమ్ జరుగుతోందన్నారు. బాధితులను కాపాడాల్సిన పోలీసులు.. తిరిగి వారిపైనే కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారుఎక్కడో ఆఫీసులో పేపర్లు కాలిపోతే.. రామచంద్రారెడ్డికి ఏం సంబంధం. ఎవరు అధికారంలో ఉన్నారు.. ఏవరి హయాంలో పేపర్లు కాలిపోయాయి. ఒక ఆఫీసులో పేపర్లు కాలిపోతే.. ఇంకో ఆఫీసులో ఉండవా.. ఇప్పుడు మొత్తం డిజిటలైజేషన్ అయ్యింది కదా. ఏదో ఒక కారణంగా వైసీపీ సానుభూతిపరులపై కేసులు పెడుతున్నారు. తాడిపత్రిలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన వ్యక్తి వస్తే.. రాళ్లు, కర్రలతో దాడులు చేస్తున్నారు. భయాందోళనకు గురి చేస్తున్నారు. మళ్లీ వారే రివర్స్‌గా గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు' జగన్ ఆరోపించారు.'ప్రస్తుత పరిస్థితుల్లో లాయర్ల అవసరం పార్టీకి చాలా ఉంది. పార్టీ కేడర్‌ను కాపాడుకోవడంలో మీ పాత్ర చాలా ఉంది. అందరం ఒకతాటి మీదకు వచ్చి పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. టీడీపీ చేసే అరాచకాలను కోర్టుల దృష్టికి తీసుకెళ్లాలి. జిల్లాల్లో లీగల్ సెల్ ఇంకా పటిష్ఠం కావాలి. ప్రతీ కార్యకర్తకు అండగా నిలవాలి. వారికి ఆపదల్లో తోడుగా ఉండాలి. గతంలో లాయర్ల సంక్షేమానికి 100 కోట్ల రూపాయలు కేటాయించాం. గతంలో ఏ ప్రభుత్వం లాయర్ల గురించి ఆలోచించలేదు. కేవలం మనవే తోడుగా ఉన్నాం' అని జగన్ వ్యాఖ్యానించారు.అనంతరం ముస్లిం మైనారిటీ ప్రతినిధులతోను జగన్ భేటీ అయ్యారు. ప్రస్తుత ప్రభుత్వంలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని జగన్ వారికి సూచించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ సరళిపైనా ఈ భేటీలో చర్చకు వచ్చినట్టు తెలిసింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పొరపాట్లను ముస్లిం, మైనారిటీ నేతలు జగన్‌కు వివరించారు.

## విజయసాయిరెడ్డిపై చర్యలా....

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ నెల్లూరు, ఆగస్టు 24:** వైసీపీ ఎమ్మెల్సీ, టెక్కలి నేత దువ్వాడ శ్రీనివాస్‌పై వేటు వేసింది వైసీపీ అధిష్టానం. దీనికి ఫ్యామిలీ వ్యవహారాలే కారణమని, అందువల్లే ఆయనను పక్కన పెట్టాల్సివచ్చిందని ఫ్యాన్ పార్టీ నుంచి ఓ ఫీలర్ బయటకు వచ్చింది. ఇలాంటి చిక్కు సమస్యను వైసీపీ ద్వితీయ నేత విజయసాయిరెడ్డి ఎదుర్కొంటున్నారు.వీఎస్ఆర్ వ్యవహారంపై దాదాపు వారంరోజుల పాటు వార్తలు నానాహంగామా చేశాయి. అయితే వీఎస్ఆర్ విషయంలో జగన్ ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని ఆ పార్టీ నేతలు ఆరా తీయడం మొదలు పెట్టారు. కొన్ని విషయాలు అంతర్గతంగా చర్చించుకోవడం మొదలైంది.దేవాదాయశాఖలో పని చేస్తున్న అసిస్టెంట్ కమిషన్ వ్యవహారంలో విజయసాయిరెడ్డిపై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనికి గురించి వేగుల ద్వారా సమాచారం తెప్పించుకున్నారట జగన్. ఈ వ్యవహారం పై పార్టీకి ఇంటా బయటా అనేక తలనొప్పులు తెచ్చాయి. కాసింత పార్టీ డ్యామేజ్ కూడా అయ్యింది.ఒకానొక దశలో వీఎస్ఆర్‌ను పార్టీకి దూరంగా పెట్టాలని నిర్ణయించుకున్నారట. కాకపోతే అక్రమాస్తుల కేసులో ఆయన అప్రూవర్‌గా మారితే లేని పోని సమస్యలు వస్తాయని భావించి సైలెంట్ అయ్యారంటూ ఆ పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి.వారం కిందట వైసీపీ కీలక నేతలను బెంగుళూరుకు రప్పించుకుని మాట్లాడట జగన్. కాకపోతే వీఆర్ఎస్‌కు ఎలాంటి కబురు లేదని, ఈ క్రమంలో ఆయనను దూరంగా పెట్టారనే చర్చ కూడా మొదలైపోయింది. ఇలాంటి వ్యవహారాల్లో చిక్కుకుని గిలగిల కొట్టుకున్న ఎమ్మెల్సీ దువ్వాడపై వేటు వేసింది ఆ పార్టీ. ఒక విధంగా నేతలకు ఇది వార్నింగ్ లాంటిదేనని అంటున్నారు.కొద్దిరోజులుగా వీఎస్ఆర్ ఎక్కడా కనిపించలేదు. కనీసం మీడియా ముందుకు వచ్చిన సందర్భాలు లేవు. కేవలం ఎక్స్ ద్వారా నాలుగు రాళ్లు విసురుతున్నారే తప్ప, జాడ కనిపించలేదని అంటున్నారు నేతలు. మొత్తానికి పెద్ద తలకాయలను హైకమాండ్ పక్కన పెట్టిందని మాట్లాడుకోవడం గమనార్హం.మరోవైపు జగన్ వ్యవహారశైలిపై దువ్వాడ అనుచరులు రుసరుసలాడుతున్నారు. దువ్వాడ ఎలాంటి తప్పు చేయలేదని సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆ పెద్దాయన మాటేంటి? అంటూ ప్రశ్నలు రైజ్ చేస్తున్నారు. వైసీపీలో ఈ వ్యవహారం ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో చూడాలి.

# తృటిలో డబుల్ సెంచరీ మిస్.. పాక్ బౌలర్లను వణికించిన రహీమ్



రావల్పిండి వేదికగా పాకిస్థాన్ తో జరుగుతున్న తొలి టెస్ట్ లో బంగ్లాదేశ్ వెటరన్ ప్లేయర్ ముష్ఫికర్ రహీమ్ చెలరేగి ఆడాడు. పాక్ బౌలర్లను చీల్చి చెండాడుతూ భారీ శతకం సాధించాడు. అయితే 9 పరుగుల తేడాతో తన డబుల్ సెంచరీ కోల్పోవడంతో తన అద్భుత ఇన్నింగ్స్ ముగిసింది. 341 బంతుల్లో 22 ఫోర్లు.. ఒక సిక్సర్ తో 191 పరుగులు చేసి మహమ్మద్ అలీ బౌలింగ్ లో వికెట్ కీపర్ కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. 150 పరుగులకు పైగా స్కోర్ చేయడం రహీం టెస్ట్ కెరీర్ లో ఇది ఆరోసారి. 147 పరుగులకు 3 వికెట్ల వద్ద క్రీజ్ లోకి వచ్చిన ఈ సీనియర్ ప్లేయర్ జట్టు స్కోర్ 528 పరుగుల వద్ద ఔటయ్యాడు. రహీమ్ ఒక్కడే 57 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేయడం విశేషం. రహీమ్ తో పాటు మిగిలిన ఆటగాళ్లు సమిష్టిగా రాణించడంతో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ లో 117 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది. ఇదే మ్యాచ్ లో పాక్ వికెట్ కీపర్ మహ్మద్ రిజ్వాన్ 171 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇన్నింగ్స్ డిక్లేర్ ఇవ్వడంతో అతను కెరీర్ లో తొలి డబుల్ సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు.

ఈ మ్యాచ్ విషయానికి వస్తే తొలి ఇన్నింగ్స్ లో పాకిస్థాన్ 6 వికెట్లను 448 పరుగుల వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ లో 565 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఆట ఒక్క రోజే మిగిలిపోవడంతో ఈ మ్యాచ్ డ్రా అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సొంతగడ్డపై పాకిస్థాన్ బంగ్లాదేశ్ బ్యాటర్లను కట్టడి చేయలేక తొలి ఇన్నింగ్స్ లో వెనకపడింది.

# ఇంగ్లీష్ గడ్డపై మెండీస్ సెంచరీ.. తొలి లంక బ్యాటర్‌గా సరికొత్త చరిత్ర

సాధారణంగా ఇంగ్లాండ్ గడ్డపై టెస్టు మ్యాచ్ అంటే ప్రత్యర్థి బ్యాటర్లు బెంబేలెత్తిపోతారు. అత్యద్భుతంగా ఆడితే తప్ప ఎంతటి స్టార్ బ్యాటర్ అయినా స్వదేశంలో ఇంగ్లీష్ బౌలర్ల దెబ్బకు బలి కావాల్సిందే. ఇక ఆసియా జట్లయితే టెస్టుల్లో ఇంగ్లాండ్ గడ్డపై రాణించడం శక్తికి మించిన పని. అయితే వీటన్నిటిని పటాపంచలు చేస్తూ శ్రీలంక బ్యాటర్ కామిందు మెండీస్ సెంచరీతో మెరిశాడు. ఇంగ్లాండ్ బౌలర్లను సమర్ధవంతంగా అడ్డుకుంటూ కొరకరాని కొయ్యలా తయారయ్యాడు. మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ స్టేడియంలో నాలుగో రోజు ఆటలో భాగంగా కామిందు మెండీస్ 175 బంతుల్లో 12 ఫోర్లు.. ఒక సిక్సర్ తో 101పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో ఏడో స్థానంలో ఇంగ్లాండ్ గడ్డపై సెంచరీ చేసిన తొలి శ్రీలంక బ్యాటర్ గా మెండీస్ చరిత్ర సృష్టించాడు. మెండీస్ ఇన్నింగ్స్ తో శ్రీలంక రెండో ఇన్నింగ్స్ లో ప్రస్తుతం 6 వికెట్ల నష్టానికి 291 పరుగులు చేసింది. క్రీజ్ లో మెండీస్ (101), చండీమల్ (62) ఉన్నారు. శ్రీలంక లంచ్ నాలుగో రోజు లంచ్ సమయానికి 169 పరుగుల ఆధిక్యంలో ఉండగా..మరో రోజు ఆట మిగిలి ఉంది. అంతకముందు శ్రీలంక 236 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ లో 358 పరుగులకు ఆలౌటైంది. దీంతో ఇంగ్లాండ్ కు తొలి ఇన్నింగ్స్ లో 122 పరుగుల భారీ ఆధిక్యం లభించింది.



# మగబిడ్డకు జన్మనిచ్చిన షాహీన్ షా ఆఫ్రిది భార్య.. సెలబ్రేషన్ వైరల్



పాకిస్థాన్ ఫాస్ట్ బౌలర్ షాహీన్ షా ఆఫ్రిది తండ్రయ్యాడు. అతని భార్య అన్షా ఆఫ్రిది శనివారం (ఆగస్టు 24) మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈబిడ్డకు అలీ యార్ అని పేరు పెట్టారు. ప్రముఖ క్రికెటర్ షాహీద్ ఆఫ్రిది కూతురుతో షహీన్ ఆఫ్రిది ఫిబ్రవరి 2023లో మొదటిసారి వివాహం చేసుకున్నారు. ఈ వివాహానికి కెప్టెన్ బాబర్ ఆజం మరియు షాదాబ్ ఖాన్‌తో సహా పాకిస్థాన్ క్రికెటర్లు హాజరయ్యారు. 2021 లో వీరి నిశ్చితార్థం జరిగింది. 2023 లో మరోసారి భార్యనే అఫ్రిది మరోసారి వివాహం చేసుకోవడం విశేషం. సెప్టెంబర్ 19 న మరోసారి ఈ వీరి వివాహం జరిగింది. ప్రస్తుతం అఫ్రిది స్వదేశంలో బంగ్లాదేశ్ సిరీస్ తో రెండు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో భాగంగా రావల్పిండిలో జరుగుతున్న తొలి టెస్ట్ ఆడుతున్నాడు. ఈ మ్యాచ్ లో బంగ్లా ప్లేయర్ హసన్ మహమ్మద్ వికెట్ తీసిన తర్వాత రెండు చేతులు ఊపుతూ సెలబ్రేషన్ చేసుకున్నాడు. ఈ సిరీస్ లో జరగబోయే రెండో టెస్టుకు ఈ పాక్ పేసర్ దూరమయ్యే అవకాశం ఉంది. కొడుకు పుట్టడంతో కుటుంబంతో గడపడానికి తన సొంత ఊరికి వెళ్లనున్నాడు. ఈ మ్యాచ్ లో అఫ్రిది మొత్తం 30 ఓవర్లు వేసి రెండు వికెట్లు పడగొట్టాడు.

# ఎల్లో చీరలో 'మొదటి సినిమా' హీరోయిన్

ప్రగ్యా జైస్వాల్ డ్రెస్ మీరు ఆమె శైలిని దొంగిలించాలని కోరుకునేలా చేస్తుంది



2005 సంవత్సరంలో నవదీప్ హీరోగా నటించిన 'మొదటి సినిమా' తో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ పూనమ్ బజ్వా. తక్కువ సమయంలోనే టాలీవుడ్ లో మంచి గుర్తింపు సొంతం చేసుకుంది. మొదటి సినిమా నిరాశ పరిచిన కూడా వరుసగా ఆఫర్లు వచ్చాయి. అయితే ఈ అమ్మడు వచ్చిన ప్రతి ఆఫర్ ను కమిట్ అవ్వడం వల్ల వరుసగా డిజాస్టర్స్ పడ్డాయి. దాంతో మెల్ల మెల్లగా ఈ అమ్మడి కెరీర్ లో డౌన్ ఫాల్ స్టార్ట్ అయ్యింది. తక్కువ సమయంలోనే ఈ అమ్మడు టాలీవుడ్ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. టాలీవుడ్ లో ఆఫర్లు తగ్గిన వెంటనే కన్నడం, తమిళం మరియు మలయాళం సినిమాల వైపు చూసింది. అదృష్టం కొద్ది టాలీవుడ్ లో దక్కని హిట్స్ మరియు కమర్షియల్ పాత్రలు ఇతర భాషల్లో దక్కాయి. దాంతో వరుసగా అక్కడ సినిమాలు చేసింది. అప్పుడప్పుడు తెలుగు లో కూడా మెరిసింది కానీ ఎప్పటి మాదిరిగానే టాలీవుడ్ ప్రేక్షకులు ఈమె ను తిరస్కరిస్తూ వచ్చారు. సోషల్ మీడియాలో పూనమ్ బజ్వా అందమైన ఫోటోలు షేర్ చేయడం ద్వారా రెగ్యులర్ గా వార్తల్లో నిలుస్తున్న విషయం తెల్సిందే. తాజాగా మరోసారి అందమైన ఫోటోలతో వార్తల్లో నిలిచింది.



ఈసారి ఎల్లో చీర కట్టు తో నడుము అందం చూపిస్తూ, చీరలో ఇంతకు మించి అందంగా ఎవరు ఉండరేమో అన్నంత అందంగా పూనమ్ బజ్వా కనిపిస్తోంది. ఆకట్టుకునే అందం తన సొంతం అంటూ ఈ ఫోటోలతో చెప్పకనే చెబుతోంది. అందమైన ఈ అమ్మడి అందానికి నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. తెలుగు లో ఇంతటి అందానికి దక్కాల్సిన ఆఫర్లు దక్కలేదు అంటూ కొందరు తెలుగు నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉంటే కొందరు మాత్రం తెలుగు లో కంటే ఇతర భాషల్లో ఈమె ఎక్కువ ఆఫర్లు తెచ్చుకోవడం సంతోషం అన్నట్లుగా కామెంట్స్ చేస్తున్నారు.పంజాబీ ముద్దుగుమ్మ అయిన పూనమ్ బజ్వా 2005 లో మిస్ పూణే కిరీటాన్ని సొంతం చేసుకుంది. మోడలింగ్ చేస్తున్న సమయంలో హైదరాబాద్ కి ఒక ర్యాంప్ షో కోసం వచ్చిన సమయంలో మొదటి సినిమా ఛాన్స్ దక్కిందట. 12వ తరగతి చదువుతున్న సమయంలోనే పూనమ్ బజ్వా కి హీరోయిన్ గా ఛాన్స్ వచ్చిందట. కాలేజ్ కి ఐదు నెలల సమయం ఉండటంతో ఆ గ్యాప్ లో సినిమాను అంగీకరించి పూర్తి చేసిందట. సినిమాల్లో నటిస్తూ కూడా పుణెలోని సింబయాసిస్ ఇంటర్నేషనల్ యూనివర్శిటీలో ఇంగ్లిష్ లిటరేచర్ లో డిగ్రీని పూర్తి చేసింది. ప్రస్తుతం నటనపై పూర్తి దృష్టి పెట్టింది.



తాజా స్నాప్‌లలో వాణి కపూర్ సొగసైన గ్రేస్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com